# వృద్ధుల శ్రేయస్సే ఈ తరం ప్రధాన లక్ష్యం కావాలి

## సేవాశ్రమం రజతోత్సవ వేడుకల్లో వక్తల అభిభాషణ –PART I

హైదరాబాద్ తుండిగల్ లోని అన్నారం గ్రామంలో ప్రశాంత ఆశ్రమం వృద్ధులకోసం ఏర్పడింది. దాని పేరు సేవాశ్రమంమానవతాదృక్పథం, భావసారూప్యతాయుతమైన సామాజిక కర్తవ్యాలు నిర్వహించాలనే ఆకాంక్ష కలిగిన కొందరు స్నేహితులు కలిపి ఈసేవాశ్రమం నిర్వహిస్తున్నారు. ఈ సేవాశ్రమం వితరణశీలుర సహాయంతో ఎంతో అభివృద్ధి చెందింది. పాతికమైలురాళ్ళు దాటుకుని ప్రయాణం సాగించింది. ఆ తీపిగుర్తులను నెమరువేసుకుంటూ, ఆ జ్ఞాపకాలను పదిలపరుచుకుంటూ పాతికేళ్ళక్రితం ఏరోజైతే సేవాశ్రమం భవన ప్రారంభోత్సవం జరిగిందో అదేరోజు అంటే, ఏప్రిల్ 17వ తేదీన 2018లో సేవాశ్రమం రజతోత్సవ వేడుకలు చేసుకుంది. ఎందరో పెద్దలు ఈ కార్యక్రమానికి హాజరై సేవాశ్రమం సేవలను కొనియాడాడు. ఈ ఘనమైన, అపురూపమైన కార్యక్రమం హైదరాబాద్ర వీంద్రభారతి ఆడిటోరియంలో జరిగింది.

సేవాశ్రమం వ్యవస్థాపక కార్యదర్శి ఎం.వి.భద్రం పాతిక సంవత్సరాలుగాతన జీవితాన్ని ఈ ఆశ్రమానికి అంకితం చేశాడు. ఎంతో అభివృద్ధి చేశారు. ఈ ప్రయాణంలో ఎందరో గొప్పవ్యక్తులు ఆయనకు అండదండలుగా నిలబడ్డారు. వాళ్ళంతా ఈ రజతోత్సవ వేడుకల్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి, తమిళనాడు మాజీగవర్నర్ కొణిజేటి రోశయ్య ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సేవాశ్రమం అధ్యక్షులు దేవినేని సీతారామయ్య, అధ్యక్షత వహించారు.సేవాశ్రమం రజతోత్సవ వేడుకల ఆహ్వానసంఘ చైర్మన్ ఎం.నాగరాజు వేదికపై ఆశీనులయ్యారు.

ఈ రజతోత్సవ వేడుకలకు కేంద్ర ప్రభుత్వ హోంశాఖ మాజీ కార్యదర్శి, నాగాలాండ్ మాజీ గవర్నర్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, యాస్కీ చైర్మన్ కె.పద్మనాభయ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కళాబ్రహ్మ, శిరోమణి వంశీరామరాజు, తెలంగాణరాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, సీనియర్స్ సిటిజన్ విభాగం కార్యదర్శి ఎం. జగదీశ్వర్, హెల్పేజ్ ఇండియా జాయింట్ డైరెక్టర్, ఎ.పీ-తెలంగాణరాష్ట్రాల యాక్టివ్ స్టేట్ హెడ్ మహమ్మద్ రజా మహమ్మద్సేవాశమం ఉపాధ్యక్షులు అట్లూరి సుబ్బారావు, సేవాశ్రమం కోశాధికారి ఎస్.ఎస్.ఆర్ కోటేశ్వరరావు, సేవాశ్రమ్ కమిటీ సభ్యులు మేజర్ జనరల్ ఎ.రవీంద్రకుమార్, డాక్టర్ సిహెచ్.వసంతకుమార్, జి.వి.కృష్ణయ్య, ఎం.లోకేశ్వరరావు, కె.జి. రంగనాథన్ ప్రభృతులు వేదికపై ఆశీనులయ్యారు. స్వర్ణోత్సవ తెలుగు చిత్రం 'భక్తప్రహ్లాద' లో ప్రహ్లాద పాత్రలో నటించిన ప్రముఖ నటి, డబ్బింగ్ ఆర్టిస్ట్ రోజారమణి, సేవాశమం మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎన్.సీతారామయ్య, సీనియర్ ఛార్టెడ్ అకౌంటెంట్ తుకారాం, పాతికేళ్ళుగా సేవాశమంలోనే ఉంటూ వృద్ధులందరికీ సేవలు అందిస్తున్న సేవాశమ్రం వెల్ఫేర్ ఆఫీసర్ మొవ్వా దుర్గాలక్ష్మి ప్రభృతులు వేదిక పైన ఆశీనులయ్యారు. సేవాశమ్రం జాయింట్ సెక్రటరీ లయన్ ఎ.విజయకుమార్ వేదికపై అతిథులందరికీ శాలువాకప్పి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సాదరంగా వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం ముఖ్యఅతిథి కొణిజేటి రోశయ్య సహా అతిథులందరూ జ్యోతి వెలిగించి సభను ప్రారంభించారు.

## భద్రంగారి గురించి ఎంత చెప్పినా చాలదు: ఎం.నాగరాజు

సేవాశమ్రం రజతోత్సవ వేడుకల ఆహ్వానసంఘం అధ్యక్షులు ఎం. నాగరాజు సభలో మొదట ప్రసంగించారు. ఈ సేవాశ్రమం అభివృద్ధి వెనుక ఇరవై ఐదు సంవత్సరాలుగా కష్టపడిన పెద్దలందరూ వేదికపై ఆశీనులయ్యారు. వీరిలో ముఖ్యంగా ఎం.వి.భద్రంగారు ఈ ఆశ్రమంకోసం ఎంతో పాటుపడ్డారు. ఆయన గురించి ఎంత చెప్పినా చాలదు. ఆయన తన ఇంటిని వదిలి వృద్ధుల క్షేమాన్ని ఆకాంక్షించి వృద్ధాశ్రమాన్ని అభివృద్ధిచేయడానికి వారిలో ఒకరుగా వృద్ధాశ్రమంలోనే ఉండిపోయి జీవితం గడిపారు. సేవలు అందించారు. అట్లూరి సుబ్బారావుగారు, జి.వి.కృష్ణయ్యగారు, లోకేశ్వర్రావుగారు, అధ్యక్షులు సీతారామయ్యగారు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సేవాశ్రమంకు సేవలు అందిస్తున్నారు. ఈ ఆశ్రమానికి ఇంకా ఎన్నో సేవలు చేయాలి. మా తండ్రిగారు మంతెన రామలింగరాజుగారు సేవాశమ్రం వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉండి భద్రంగారితో కలిసి ఆశ్రమం అభివృద్ధికి పాటుపడ్డారు. ఆశ్రమానికి సేవలు అందించారు. మాక్కూడా ఈ ఆశ్రమానికి సేవలు అందించాలనే ఆకాంక్ష ఎంతో ఉంది. దుర్గాలక్ష్మిగారు కూడా పాతికేళ్ళుగా వృద్ధులకు సేవాశ్రమంలో సేవలు అందిస్తున్నారు. ఈ సేవాశ్రమాన్ని ఇంకా అభివృద్ధిలోకి తీసుకురావాలని మీరందరూ ఆశీర్వదించాలి అని నాగరాజు తన ప్రసంగంలో కోరారు.

## వృద్ధుల ఆత్మగౌరవం, స్వావలంబనే మా మార్గదర్శక సూత్రం: దేవినేని సీతారామయ్య




Lion Arigapudi Vijay Kumar garu felicitating Devineni Sitaramaiah garu.

సేవాశ్రమం అధ్యక్షులు దేవినేని సీతారామయ్యగారు ఆంగ్లంలో ప్రసంగించారు. సభకు హాజరైన ప్రముఖులు, ముఖ్య అతిథి, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మా సేవాశ్రమాన్ని ఆశీర్వదించడానికి ఇక్కడకు వచ్చి వేదికమీద ఆశీనులైన పెద్దలు, అతిథులు, ముఖ్యంగా ఇక్కడ సభలో హాజరైన మన సమాజంలో అతిముఖ్యమైన వృద్ధులు, సేవాశ్రమం మేనేజింగ్ కమిటీ సభ్యులందరికీ, ఆహ్వానితులు అందరికీ నా శుభాభినందనలు. సమాజంలోని వృద్ధుల జీవితానుభవాలు, వారి అనుభవజ్ఞానం, మన సమాజానికి వారు అందించిన సేవలు మనందరికీ మార్గదర్శకత్వాలు, సీనియర్ సిటిజన్లు సమాజానికి అందించిన సేవలను మనం గౌరవించాలి.

ఆ సేవాఫలితాలను మనమొక ఉత్సవంగా చేసుకోవాలి. కానీ దురదృష్టవశాత్తు, ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ సంస్కృతి కారణంగా వృద్ధులను ఎందుకూ కొరగానివారుగా, సమాజానికి భారంగా పరిగణిస్తున్నారు. దాంతో వారు నిర్లక్ష్యానికి గురై ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. కానీ ఆ వయసులో వృద్ధులు సంతోషకరమైన జీవితం గడపాలంటే సమాజం వారిపట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. ఒకప్పుడు మనం పిల్లలుగా ఉన్నప్పుడు మనల్ని సంరక్షించి పెంచి పెద్దచేసిన మన పెద్దలకు ఈ వృద్ధాప్యంలో అత్యున్నతమైన గౌరవమర్యాదలిచ్చి వారి ఆరోగ్యం, బాగోగులూ చూసుకుంటూ వారిని సంరక్షించాల్సిన బాధ్యత, కర్తవ్యం మనపై ఉంది. ఈ కాలంలో చాలామంది వృద్ధులు తమ కుటుంబాలకు దూరంగా వృద్ధాశ్రమాల్లో జీవితాలు గడపడం మనం చూస్తున్నాం. అలాంటి సమయంలో వారికి మనోవిశ్వాసం, శారీరక బలం, అండదండలు అవసరం. వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణ, వారికి పోషకాహారం అందించడం వంటివి ప్రధాన సమస్యలుగా, అంశాలుగా ముందుకు రావడం, మారిపోవడంతో, వారి బాగోగులు చూసుకోవడంకోసం రిటైర్మెంట్హోమ్స్, రిక్రియేషన్ సెంటర్లు అవసరమయ్యాయి.

ఈ కేంద్రాలలో వృద్ధులకు పోషకాహారం సమకూర్చి, యోగా, ధ్యానం, వ్యాయామకేంద్రం, క్విజ్, వినోదం, ఇండోర్గేమ్స్ వంటి కార్యకలాపాలు ఏర్పాటుచేసి తగిన సౌకర్యాలన్నీ సమకూర్చాలి. తద్వారా వారికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ, మానసిక స్థిరత్వం చేకూర్చడానికి దోహదం చేయగలుగుతాం. ఇది అతి ముఖ్యమైన అవసరం. ఆ అవసరం గుర్తించిన మా స్నేహితులం కొందరం ఏకమై వృద్ధులకోసం 'సేవాశ్రమం' స్థాపించాం. దాత, వితరణశీలి బొబ్బా మోహనరావుగారు దిండిగల్ లోని అన్నారం గ్రామంలో ఒక ఎకరం స్థలం విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో రెండంతస్తుల భవనాన్ని ఇరవై గదులుతో నిర్మించాం. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ, దాతల విరాళాలతో ఇరవై గదులు నిర్మించాం. ఈ సేవాశ్రమంలో 20 వేల పుస్తకాలతో ఒక మంచి గ్రంథాలయంతోపాటు అత్యాధునిక సదుపాయాలు ఇక్కడ సమకూర్చాం.

వివిధ జీవన స్రవంతులకు చెందిన రిటైరైన ప్రభుత్వ అధికారులు, విద్యావంతులు, వృత్తినిపుణులు, వృద్ధులు తదితరులు ఒక ఉమ్మడి కుటుంబంలాగా ఈ సేవాశ్రమంలో ఆత్మగౌరవంతో, స్వావలంబనతో ఐక్యంగా కలిసి జీవించాలనేదాన్ని మార్గదర్శక సూత్రంగా (గైడింగ్ ప్రిన్సిపల్) మా సేవాశ్రమం నిర్దేశించుకుంది. సేవాశ్రమానికి ఎప్పటికప్పుడు గౌరవ అతిథులను పిలిచి సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటాం. హైదరాబాద్ నగరంలో ఉన్న వృద్ధాశ్రమాలలో మా సేవాశ్రమం ఒక అత్యుత్తమమైనదని గర్వంగా చెప్పగలం.

పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా దాతలు, వితరణశీలుర సహాయంతో మరింతమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు మరో బ్లాక్ నిర్మించాలనే ఆలోచనలో ఉన్నాం. మా సేవాశ్రమంలో వృద్ధులకు నర్సింగ్ కేర్ను కూడా ప్రత్యేక అవసరంగా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నాం. వృద్ధుల సేవలో మా సేవాశ్రమం పాతిక సంవత్సరాలుపూర్తిచేసుకుని రజతోత్సవవేడుకల వాకిట నిలబడటం మాకెంతో సంతోషంగానూ, సంతృప్తిగానూ ఉంది. వృద్ధులకు సేవలు అందించడంలో సహాయ సహకారాలు అందించిన వారందరికీ సేవాశ్రమం తరపున పేరు పేరునా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అన్నారు. సీతారామయ్యగారు.

## ఎం.వి.భద్రంగారికి సన్మానం



M V Bhadram gari felicitation

ఇటుక ఇటుకా పేర్చి పాతికేళ్ళుగా ఈ సేవాశ్రమాన్ని తీర్చిదిద్ది ఈ స్థాయిలో దీనిని అభివృద్ధిచేసిన 'సేవాశ్రమం' వ్యవస్థాపక కార్యదర్శి ఎం.వి.భద్రంగారిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఆయనను సభలో ప్రత్యేక ఆసనంపై కూర్చోబెట్టి మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీగవర్నర్ కొణిజేటి రోశయ్య, పద్మభూషణ్ డా. కె. పద్మనాభయ్య కలిసి భద్రంగారికి శాలువా కప్పి సత్కరించారు. రోజారమణి, లయన్ విజయకుమార్ ఇద్దరూ భద్రంగారి పాదాలకు నమస్కారం చేసి పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు.

## సేవాశ్రమానికి ఉచితంగా లిఫ్ట్

సమకూర్చిన గోమాత నవీన్ కు సన్మానం.

సందర్భంగా వితరణశీలి గోమాత నవీన్ న్ను కూడా ఘనంగా సత్కరించారు. సేవాశ్రమానికి పది లక్షల రూపాయల విలువైన లిఫ్ట్ను ఉచితంగా ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. గోమాత నవీన్. సేవాశ్రమం సంయుక్త కార్యదర్శి లయన్ విజయకుమార్ గారి స్ఫూర్తితో నవీన్ ఈ వితరణచేశారు. కొణిజేటి రోశయ్య, దైవజ్ఞశర్మ ఇద్దరూ గోమాత నవీన్ కు శాలువాకప్పి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. సేవాశ్రమం భోజన వసతుల నిమిత్తం ప్రతి సంవత్సరం ఆరు లక్షల రూపాయల విలువైన ప్రావిజన్స్ సమకూరుస్తున్న శ్రీవారెడ్డి గారికి, ఎస్.పి.బన్సల్ గారికి కూడా ఈ సందర్భంగా సేవాశ్రమం జాయింట్ సెక్రటరీ లయన్ విజయకుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## సావనీర్ విడుదల



సేవాశ్రమం రజతోత్సవం సందర్భంగా సావనీర్ను విడుదల చేశారు. ముఖ్యఅతిథి కొణిజేటి రోశయ్య, డా. పద్మనాభయ్య చేతులమీదుగా ఈ సావనీర్ విడుదలైంది. ఎం.వి.భద్రం, దేవినేని సీతారామయ్య, అట్లూరిసుబ్బారావు. రోజారమణి తదితరులు వారికి సహకరించారు. సేవాశ్రమంలో వృద్ధులందరికీ, వారం వారం వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మెహతాను ఈ సందర్భంగా లయన్ విజయకుమార్ ఘనంగా సన్మానించి ఆయన కాళ్ళకు నమస్కరించారు.



## సేవాశ్రమం కృషి బహుధా ప్రశంసనీయం : ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి, తమిళనాడు మాజీగవర్నర్ కొణిజేటి రోశయ్య



ముఖ్యఅతిథి కొణిజేటి రోశయ్య వేదికపై ప్రసంగించారు. ఆయన ప్రసంగం ఇలా ఉంది. హైదరాబాద్ మహానగరంలో ఇలాంటి పెద్దలతో కూడిన సభలు జరగడం చాలా అరుదు. జనరల్ గా రవీంద్రభారతిలో కార్యక్రమాలు ఎన్నో జరుగుతూ ఉంటాయి, మిగిలిన కళామందిరాల్లో కూడా ఎన్నో జరుగుతూ ఉంటాయి. కానీ ఈనాటి ఈ కార్యక్రమానికి చాలా ప్రత్యేకత, విశిష్టత ఉన్నది. వయసులో పెద్దవారినీ, ఎవరూ లెక్కచేయకుండా వదిలిపెట్టేసి న పెద్దవారినీ కలిపి వారికొక వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుచేసి సకలు జాగ్రత్తలూ తీసుకుంటూ, వారిని పోషిస్తూ వారి శ్రేయస్సు, సంక్షేమం కోసం పాటుపడటం ఎంతో సంతోషకరమైన విషయం.

ఈ రోజు ఈ విధంగా సేవాశ్రమం రజతోత్సవ వేడుకలు చేసుకోవడం వెనుక పెద్దలు చేసిన కృషి ఎంతో ఉంది. హైదరాబాద్లో మరికొన్ని వృద్ధాశ్రమాలు కూడా ఉన్నాయి. కొన్ని నామమాత్రంగా ఉంటే, మరికొన్ని సార్థకత సంతరించుకుని బాగా పనిచేస్తూ ఉంటాయి. అన్నారంలోని ఈ సేవాశ్రమంలో తక్కువ సంఖ్యలో వృద్ధులు ఉన్నప్పటికీ, వారిని చాలా జాగ్రత్తగా చూసుకుంటూ ప్రతిఒక్కరికీ మంచి సేవలు అందజేస్తున్నారు. ఇందులో ఉన్న వృద్ధులందరినీ తమ సొంత తల్లిదండ్రులుగా చూసుకుంటున్నారు. ఈ వృద్ధాశ్రమం ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా నిర్వాహకులను ప్రత్యేకంగా మనఃపూర్వకంగా అభినందిస్తున్నాను. నిర్వాహకుల కృషి బహుధా ప్రశంసనీయం. ఈ వృద్ధాశ్రమంలో ఉన్న తల్లిదండ్రులు వయసులో పెద్దవారు, వారికి పిల్లలు లేక కాదు, పిల్లలు తమ పట్ల సరైన శ్రద్ధ చూపించడం లేదనే భావనతో వృద్ధాశ్రమంలో చేరేవారు కొందరు ఉంటారు. ఏది ఏమైనప్పటికీ, ఈ వృద్ధాశ్రమం ఇలాగే సేవలు అందించాలనీ, ఈ సేవలు బహుముఖంగా ఉండాలని కోరుకుంటూ నేనుసెలవు తీసుకుంటున్నాను అని రోశయ్య తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ హోంశాఖ మాజీ కార్యదర్శి, నాగాలాండ్ మాజీ గవర్నర్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, కె.పద్మనాభయ్య



మా గురువుగారు సీతారామయ్యగారు, ఈ సంస్థను నడిపించడంలో ఎంతో కృషి చేసిన ఎం.వి.భద్రంగారు, జాయింట్ సెక్రటరీ విజయకుమార్, జగదీశ్వర్ గారు సహా అనేక మంది వేదికమీద ఉన్న అతిథులు, సభలో పాల్గొన్న పెద్దలు, సీనియర్ సిటిజన్లకు అందరికీ నమస్కారాలు. హైదరాబాద్లో సుమారు 150 వరకు వృద్ధాశ్రమాలు ఉన్నాయని విన్నాను. ఐతే పాతికేళ్ళక్రితంఎన్ని ఉన్నాయో నాకు తెలియదు. కానీ బహుశా వీళ్ళదే మొదటిదై ఉండవచ్చు. లేదా రెండోదై ఉండవచ్చు. ఇప్పుడైతే ప్రతివారూ వృద్ధాశ్రమాల గురుంచి మాట్లాడుతున్నారుగానీ, పాతికేళ్ళక్రితం వృద్ధాశ్రమం గురించి ఎవరైనా మాట్లాడారో లేదో కూడా నాకు తెలియదు. అలాంటిది పాతికేళ్ళక్రితం వీరికి ఈ ఆలోచన వచ్చి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయడం అనేదే ఒక రివల్యూషనరీ ఇనిషియేటివ్. పాతికేళ్ళు కంపెనీలే నడవడం లేదు, మూతపడిపోతున్నాయి, అలాంటిది ఒక స్వచ్ఛంధ సేవాభావంతో పాతికేళ్ళుగా దీనిని నడుపుతున్నారు. ఎంతో సేవాభావం ఉంటే తప్ప ఇంతకాలం దీనిని నడపలేరు. అలాంటి గొప్ప సేవాభావం ఉన్న భద్రంగారికి, నిర్వాహకులకు నా శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నాను.



ఇక్కడ ఒక మంచి వీడియోను చాలా బాగా చూపించారు. ఒక రోజు వెళ్ళి సేవాశ్రమంలో నేను హాఫ్ డే గడిపాను. ఎంతబాగుందో చెప్పలేను. చాలా బ్యూటిఫుల్గా ఉంది. కాలుష్యం లేని వాతావరణంలో ఎంతో గ్రీనరీగా ఉంది. అయితే వీరికి నేను రెండు సలహాలు చెప్పదల్చుకున్నాను. ఒక ఎకరం స్థలం ఉంది. చిన్న భాగంలోని భవనం కట్టారు. ఇంకా కొంత స్థలం ఉంది. ఆర్గానిక్ ఫార్మింగ్ని ఇంకా ఎక్కువ చేస్తే బాగుంటుంది. కమర్షియల్గా కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ రోజుల్లో బయట పాలు తాగాలంటే భయం వేస్తోంది. అందుకని ఆశ్రమవాసులకు మంచి ఆరోగ్యకరమైన పాలు ఇవ్వడం కోసం నాలుగైదు ఆవుల్ని కూడా పెంచితే బాగుంటుంది. మరో విషయం ఏమిటంటే,వృద్ధాశ్రమాలకు పిల్లలు ఉన్నవాళ్ళు. లేనివాళ్ళు మాత్రమే వెళ్ళారనుకుంటున్నారు, కానీ మూడో రకం వాళ్ళు కూడా ఉన్నారు నాలాంటివాళ్ళు. నన్ను పిల్లలు బాగా చూసుకుంటున్నారు. అంతా బాగానే ఉంది, కానీ ర్యాట్ రేస్ లా ఎంతకాలం బతుకుతాం? అందుకే బాదరబందీలు తగ్గించుకుని, ఎక్కడికైనా వెళ్ళి విశ్రాంతిగా ప్రశాంతంగా ఉండి పుస్తకాలు చదువుకుంటూ ఉండాలనే నాలాంటివాళ్ళు కూడా ఉంటారు. అదే విధంగా మన సంస్కృతి, సంప్రదాయం ప్రకారం, వానప్రస్థాశ్రమం అనేది ఒకటుంది. అందులో ఏం చెప్పారంటే, పిల్లలు చూడటం లేదని కాదు, అరణ్యంలోకి వెళ్ళి కూర్చుని, వృద్ధాప్యంలో వానప్రస్థాశ్రమం తీసుకుని మనకు ఇష్టమైన దాన్ని ధ్యానించుకుంటూ, ప్రశాంతత పొందాలి. కాబట్టి వృద్ధాశ్రమంలో ఉన్నవారికి నాది సలహా ఏమిటంటే, ఏదో పిల్లలు వదిలేస్తే వచ్చేశాం అని అనుకోకుండా, మేం ఇక్కడికి కావాలని వచ్చాం అనే భావనతో వృద్ధాశ్రమంలో గడిపితే అక్కడ హాయిగా ఉండగలుగుతారు. మరొక విషయం ఏమిటంటే, మనకి మేన్ ఇయర్స్ అని చెబుతారు.

ఈ వృద్ధాశ్రమంలో 30 మంది వృద్ధులున్నారు. ఆడవాళ్ళే ఎక్కువగా ఉన్నారు. అంటే వారికి ఒక్కొక్కరికీ జీవితంలో 30 సంవత్సరాల మేన్ ఇయర్స్ అనుభవం ఉంటుంది. అంటే, మొత్తం కలిపితే, 900 మేన్ ఇయర్స్ అనుభవంఈ వృద్ధాశ్రమంలో ఉంది. ఇంత గొప్ప అనుభవం ఒకేచోట ఎక్కడా, ఎవరికీ దొరకదు. ప్రతిఒక్కరిలోనూ ఏదో ఒక క్వాలిటీ, టేలంట్ ఉంటుంది, అందువల్ల ఆ టేలంట్ని ఉపయోగించుకోవాలి. తమ అనుభవాన్ని వృధా చేయకుండా, అన్నారంలో ఉన్న పిల్లల్ని పిలిచి అనేక విషయాలు చెప్పడం, ఉపన్యాసాలు చెప్పడం, ఆర్టికల్స్ రాయడం లాంటి ఎన్నో పనులు చేయవచ్చు. వృద్ధులు ఆ విధంగా తమకున్న సమయాన్ని చాలా చక్కగా గడుపుతారనీ, సద్వినియోగం చేస్తారనీ ఆశిస్తున్నాను అని పద్మనాభయ్య తన ప్రసంగంలో చెప్పారు.

## ఎం.వి.భద్రం కార్యదర్శి నివేదిక:

ఈ సేవాశ్రమాన్ని స్థాపించి, సేవాశ్రమం అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన వ్యవస్థాపక కార్యదర్శి ఎం.వి.భద్రం కార్యదర్శి నివేదిక సమర్పించారు.

## అత్యున్నత ప్రమాణాలతో నడుస్తున్న సేవాశ్రమం ఇదే: స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్




తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్ ప్రసంగించారు. పెద్దలు చాలామంది వేదికమీద ఆశీనులై ఉన్నారు. సీతారామయ్యగారు. భద్రంగారు, విజయకుమార్ గారు అందరికీ నమస్కారాలు తెలియజేస్తున్నాను. నాక్కూడా ఒకసారి స్వయంగా సేవాశ్రమాన్ని చూసే అవకాశం కలిగింది. ఉల్లాసకరమైన చక్కటి వాతావరణంలో ఉన్న ఆశ్రమవాసులంతా ఒకరినొకరు ఆదుకుంటూ, ఆత్మీయంగా పలకరించుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు. ఇలాంటి వాతావరణం ఏర్పడటం వెనుక ఇరవై ఐదు సంవత్సరాల కృషి ఉంది. అంత గొప్ప సేవలు అందించిన సేవాతత్పరలు ఎం.వి.భద్రంగారు. వారికి ఎంతోమంది దాతలు. సహాయపడ్డారు. సేవాశ్రమంలో ఉన్న సిబ్బంది కూడా చాలా అంకితభావంతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. వారందరినీ కూడా ఈ రజతోత్సవం సందర్భంగా నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఎందుకంటే, సేవాశ్రమాన్నో, వృద్ధాశ్రమాన్నో ప్రారంభించడం సులభమే కావచ్చుగానీ, సుదీర్ఘకాలంగా నడపడం మాత్రం అంత ఈజీ పనేమీ కాదు. అందువల్ల భద్రంగారు. చేసిన ఇరవై ఐదు సంవత్సరాల జర్నీ, వారి జీవితం చాలామందికి స్ఫూర్తిదాయకంగానూ, అందరికీ మార్గదర్శకంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. సేవారంగంలో అత్యున్నతమైన ప్రమాణాలతో ఈ సేవాశ్రమం నడుస్తోంది. అందువల్ల మనందరం కూడా ప్రభుత్వం, సమాజం వారు చేస్తున్న సేవల్ని గుర్తించి వారిని ప్రోత్సహించి, వారికి కావాల్సిన తోడ్పాటును మనం అందరం కూడా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ అవకాశం నాకు కలిగించిన విజయకుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని జగదీశ్వర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

జాయింట్ డైరెక్టర్, హెల్పేజ్ ఇండియా, ఆంధ్రా, తెలంగాణరాష్ట్రాల్ల స్టేట్ హెడ్ మహమ్మద్ రజా మహ్మద్ సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగం ఇలా సాగింది. వేదికపైన ఉన్న పెద్దలు సీతారామయ్యగారు. ఎం.వి.భద్రంగారు, విజయకుమార్, జగదీశ్వర్ గారు, శ్రీమతి రోజారమణిగారు ఇతర పెద్దలు సభకు వచ్చిన ప్రముఖులు, సీనియర్ సిటిజన్లు, పత్రికా విలేకరులందరికీ మా హెల్పేజ్ ఇండియా తరపున శుభాభినందనలు. సేవాశ్రమం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు మమ్మల్ని ఆహ్వానించిన లయన్ విజయకుమార్ బృందానికి కృతజ్ఞతలు తెలియచేస్తునాను.




మేమిద్దరం-మాకిద్దరు అనే న్యూక్లియర్ కుటుంబ వ్యవస్థ నడుస్తున్న ఈ కాలంలో 40మంది వృద్ధులను ఒకచోట చేర్చి వారికి సంతోషాన్ని, ఆనందాన్ని కలిగించే విధంగా కాలుష్యానికి దూరంగా గ్రీనరీ మధ్య ప్రధాన రహదారిమార్గం పక్కనే ఒక ఆశ్రమాన్ని, చక్కటి వాతావరణంలో నడిపించటం ఎంతో ముదావహం. నేను కూడా ఈ ఆశ్రమాన్ని ఒక సారి వెళ్లి చూశాను. చాలా బావుంది అక్కడ. హైదరాబాద్లోని అత్యుత్తమమైన వృద్ధాశ్రమాల్లో ఒకటిగా నిలిచి ఈ రోజు 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రజతోత్సవాలు చేసుకోవటం ఆనందదాయకం. మరొకసారి సేవాశ్రమ్ నిర్వహణకమిటీకి అభినందనలు తెలియచేస్తున్నాను. ఇదొక వానప్రస్థాన ఆశ్రమం. ఎందుకంటే కుటుంబ బంధాలనుంచి దూరమైపోయి చివరి దశలో వృద్ధులు లైఫ్ జర్నీలో ప్రశాంత వాతావరణంలో గడపడానికి ఈ వానప్రస్థాశమ్రం గొప్ప పాత్ర నిర్వహించాలని ఆశిస్తున్నాను. వృద్ధులందరూ భగవంతుని ధ్యానంలో గడపడానికి, వారందరికీ మనశ్శాంతి కలగడానికి అంతిమ దశలో తమ జీవితాన్ని సంతోషంగా పూర్తి చేయటానికి ఇది ఉపయోగపడాలి. దీనిని విజయవంతంగా నిర్వహిస్తున్న భద్రంగారికి, లయన్ విజయకుమార్ గారికి నా ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను.

అనంతరం సేవాశ్రమం ఉపాధ్యక్షులు అట్లూరి సుబ్బారావు గారు మాట్లాడారు. మా అధ్యక్షులు సీతారామయ్యగారు, భదంగారు, లయన్ విజయకుమార్ గారు ఈ సభలో పాల్గొన్న మీ అందరికీ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. సేవాశ్రమంకు నా అభినందనలు

